
# నల్లమిల్లి సుబ్బరెడ్డి కథ



మా అసలు ఊరు ఈ పసలపూడిగాదు కుతుకులూరు.

ఆ వూర్నుంచి పసలపూడి రావడానికి మధ్యలో బోలెడు కత జరిగింది.

మా తాతగారు నల్లమిల్లి పెదభామిరెడ్డిగారు. మొదటిభార్యపోతే పసలపూడిలో క(రి సత్తిరాజుగారి చెల్లెలు ఆదియమ్మని రెండో భార్యగా చేసుకున్నాడు. ఆమెకి ఇద్దరు కొడుకులు అందులో పెద్దోడు సుబ్బారెడ్డి. అతనే మా నాన్న.

మాతాతకి మా నాయనమ్మ కాక పెడపర్తిలో వెంకటరత్నం అనే ముండ ఉండేది. బాగా ముసలరకం వచ్చేకా నేనూ చూసేను. చాలా పెద్ద కళ్ళు ఆ మనిషివి. ఆరోజుల్లో ఆవిడకి పది ఎకరాల పొలం రాశాడట మా తాత.

మాతాత తదనంతరం మానాన్నా చిన్నాన్నా పంచుకున్నారు ఆస్తిని. మా చిన్నాన్న తమ్మిరెడ్డి మా నాన్న సుబ్బారెడ్డి కంటే తెలివైనవాడు.

ఇక మా నాన్న సంగతికొస్తే

నిక్కరూ, ఓపెన్ షర్టూ వేసుకుని పొట్టిగా ఉండే మానాన్న అందగాడు. అతని పోలికలు మా ఇంట్లో ఎవరికీ రాలేదు. ఓల్డ్ ఎస్.ఎస్.ఎల్.సి చదివాడు. హిందీ బాగా చదూకున్నాడు. ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. జేబులో పట్టేంత చిన్న పుస్తకంలో ఎప్పుడూ ఏవో రాసుకుంటూ వుండేవాడు. నలకల్లాంటి అక్షరాలు. అది మాకెవరికీ కనపడకండా ఎక్కడో దాచుకునేవాడు.

ఏ దురలవాటూ లేని మా నాన్న మగ్గాలుకొని పెద్దాపురం నించి నేతగాళ్ళని కుతుకులూరు పిలిపించి పట్టు ఇండస్ట్రీ పెట్టాడు. తనకి బొత్తిగా చేతకాని వ్యవహారం అది. విపరీతంగా నష్టమొచ్చేసింది. ఆస్తిలో కొంత అమ్మేసి అప్పులన్నీ తీర్చేసి కొన్నాళ్ళు ఖాళీగా ఉన్నాడు. దాంతో, మా అమ్మ ఆస్తంతా తగలేస్తున్నాడు నా పిల్లల్ని బికారుల్ని చేసేలాగున్నాడని ఒకటే గోల.

ఎవరో అయిడియా ఇచ్చేరు. దాంతో సీవండి గిన్నెల ఇండస్ట్రీ పెట్టాడు.

ఇదీ లాసే... ఇంతకు ముందు దానికంటే పెద్ద లాసు.


ఆస్తిలో కొంతభాగం అమ్మేసి అప్పులు తీర్చాడు. ఇదంతా చూస్తున్న మా అమ్మ సూరమ్మ తన ఆస్తే గాకండా మా పుట్టింటోళ్ళిచ్చిన ఆస్తికూడా అవ్వగొట్టే స్తున్నాడు ఇక నా బిడ్డల గతి ఏంటి దేవుడోయ్? అని ఏడ్డం మొదలెట్టింది. ఏడుపుతో ఆపదు పెద్ద నస.

ఆ రోజుల్లో చాలా మంది ఈ ప్రాంతాల్నుంచి కర్నాటక రాష్ట్రం వెళ్ళి అక్కడ పొలాలు కొని సాగు చేసుకొనేవారు.

ఎప్పుడూ పొలంగట్టు తొక్కని మా నాన్న కడుపుతో వున్న మా అమ్మనీ మా అక్క సత్యవతినీ నన్ను కర్నాటక రాష్ట్రం తీసుకెళ్ళాడు.

గంగావతికీ సిద్దాపురకీ మధ్యలో ఉన్న తెలుగువాళ్ళ కేంప్‌లో మకాం. పెద్ద తాటాకుపాక వేసుకుని అందులో ఉండేవాళ్ళం.

చిత్రమైన మనిషి వ్యవసాయం మానేసి కన్నడం నేర్చుకోవడంలో పడ్డ మా నాన్న నాళెమళె బరహుదు- రేపు వాన రావచ్చు... ఇందు పత్ర బందీతు- ఈరోజు జాబు రావచ్చు. అవళు తప్పదె బందాళు- ఆమె తప్పక రావచ్చు.



దూరంగా నిలబడి అదంతా చూస్తున్న మా అమ్మ పెద్దగా అరుస్తూ ''నేనెప్పుడో అనుకున్నాను. ఈ మనిషి ఈవూళ్ళో కన్నడం దాన్నెవర్నో మరిగేడని లేకపోతే ఈ ఎదవభాష ఇంత కష్టపడి ఎందుకు నేర్చుకుంటున్నాడూ'' అంటా మొదలెట్టింది గొడవ.

అయినా మా నాన్న కన్నడం విద్య కుంటు పళ్ళేదు.

మా అమ్మకి పుట్టిన కవలపిల్లలకి రామచంద్రారెడ్డి, రామలక్ష్మి అని పేర్లు పెట్టేరు.

కొన్నాళ్ళు బతికి చనిపోయింది మా చెల్లి రామలక్ష్మి.

మానాన్నకి కన్నడం బాగా వచ్చింది. వ్యవసాయంలో విపరీతంగా లాసొచ్చింది.

మేముండే పాకలో దొంగలు పడ్డారు. దాంతో కొన్నపొలం అర్ధణాకి అమ్మేసి వెనక్కి తీసుకొచ్చాడు మా అందర్నీ.

అడవిలో ఒక కొండ కొని పోడు వ్యవసాయం చేద్దామని గోకవరం అవతలున్న ఫోక్స్‌పేట తీసుకెళ్ళేడు మా అందర్నీ.

ఆ కొండని చూసిన మా అమ్మ లబో దిబో మని శోకాణాలెట్టింది.

పోడు వ్యవసాయమనేది. చాలా కష్టంతో కూడుకున్న పని. అది చెయ్యడంలో ఓడిపోయిన మా నాన్నకి భయం పెరిగింది. రాత్రుళ్ళు నిద్రపోయేవాడు కాదు. అప్పుడే అలవాటయినియ్యి సిగరెట్లు. చాలా స్ట్రాంగా ఉండే దక్కను సిగరెట్లు. ఎర్రటి మానాన్న పెదాలు నల్లగా అసహ్యంగా తయారయ్యాయి.

మా అమ్మ శాపనార్థాలూ పెట్టినట్టే అయ్యింది.

ఏం మిగల్లేదు.

తట్టా, బుట్టా సర్దుకుని రాజమండ్రి బస్సెక్కి అక్కడ్నించి రైల్లో బిక్కవోలు స్టేషన్లో దిగి, జట్కా బండిమీద పక్కనే ఉన్న మా అమ్మమ్మగారూరు బలభద్రపురం వెళ్ళాం.

మాపెద్ది రాజమ్మా, పిన్నిలు ఆదిలక్ష్మి, శేషమ్మా మా మావయ్య పడాల వెంకటరెడ్డి మమ్మల్ని చాలా చిన్న చూపు చూడ్డం మొదలెట్టారు.

అది భరించలేక పోయిన మా అమ్మ ''చూడు ఆళ్ళ ముందెంత చులకనై పోతున్నామో ఆళ్ళిచ్చిన ఆస్తి మొత్తం అవ్వ గొట్టేసేవు ఇక నా బిడ్డల గతేంటి దేవుడోయ్'' అని ఒకసారీ రెండుసార్లూ గాదు సందు దొరికినప్పుడల్లా ఇదే పాట.

చెల్లూరులో కొత్తగా షుగర్ ఫ్యాక్టరీ కట్టారని తెల్సి ఓల్డ్ ఎస్సెస్సెల్సీ ఫస్టుక్లాసులో పాసై ఉన్న మా నాన్న ఏదన్నా ఉద్యోగం దొరుకుద్దని వెళ్ళాడు.

ఫేక్టరీవాళ్ళు ఆనాకా రేపూ అంటుంటే వాళ్ళ చుట్టూరా తిరుగుతున్నాడు.

ఈలోగా బతకాలిగాబట్టి ద్రాక్షారామం అబ్బునరెడ్డిగారి టూరింగ్‌టాకీసులో ఆపరేటరుగా చేరాడు. అక్కడ పరిచయమైంది దొడ్డంపేట నించి సినేమా కొచ్చిన వెంకటలక్ష్మి. పెళ్ళయిన మనిషే. ముప్పయికి పైనుంటది వయసు. బొద్దుగా ఉంది. చీర మోకాళ్ళలాగి కచ్చంపోసి కట్టింది. బలమైన పిక్కలు నెవరగంత దగ్గర కాలినమచ్చ, బాగుంది మనిషి.

మా అమ్మతో నరకయాతన పడ్తున్న మానాన్న సుబ్బారెడ్డికి ఈ వెంకటలక్ష్మిని కలిశాకా చాలా హాయిగా వుంది. చెల్లూరు ఫేక్టరీలో పనికంటే ఇదే బాగుంది అనుకున్నాడు. ఎందుకంటే వెంకటలక్ష్మి దగ్గర్లో వుంటది కదా?

ఒకరోజయితే మీ ఇంటికొచ్చి ఆవిడ్ని పిల్లల్నీ చూస్తానంది వెంకటలక్ష్మి.

''వద్దు ఆ మనిషి అదోరకం దాంతో పడలేం'' అని నోటిదాకా వచ్చిందికానీ, అనలేక పోయేడు మానాన్న.

శీతాకాలం.

ఎండ గట్టిగా కాస్తున్నా పగలే చలిగా ఉంది. అప్పుడప్పుడూ సూర్యుడు మబ్బుల్లోకెళ్ళి పోతున్నప్పుడు పగలే వెన్నెల్లాగుంది.

రాంపురం ఆర్టోసుకూల్ డ్రింకు సీసాకాయలూ, కొరికితే చాతీ మీద రసం కారే తాపేశ్వరం మడతకాజాలూ, రాంపురం రాజుగారి మిఠాయి కిళ్లీలూ పట్టుకుని రిక్షా దిగింది వెంకటలక్ష్మి.

చాలా చనువున్న దాన్లాగ ఇంట్లో కొచ్చేసి నాకూ మా తమ్ముడికీ, తెచ్చిన సరుకులు పంచి పెట్టేసి మా అమ్మ దగ్గరకెళ్ళి ''ఈ కిళ్ళీలు వేసుకోండి అక్కయ్యగారూ..ఈ ఏరియాలో ఈటిని తినని మనిషేలేడు. ఈటిని అమ్మే రెండు మేడలు కట్టేడు రాంపురం రాజుగారు'' అంది.

నిద్రపోతున్న మానాన్న వెంకటలక్ష్మి మాటలకి లేచొచ్చి ''ఇదేనా రావడం'' అన్నాడు.

ఇదంతా కాస్సేపు చూసిన మా అమ్మకి కత బాగా అర్ధమయిపోడంతో లేచింది. ''కాపరాల్నిడదియ్యడానికొచ్చేవేంటే సెట్టో సెంబాకారీ ముండా'' అంటా నానాతిట్లూ తిట్టి కోమటిరత్తమ్మ కొట్టుదాకా తరిమేసి అక్కడ జబ్బట్టుకుని గుడ్డలిప్పి మరీ కొట్టింది వెంకటలక్ష్మిని, అక్కడితో ఆపకుండా ద్రాక్షారం సినేమాహాలు దగ్గరకెళ్ళి నానాపెంట చేసింది.

దాంతో మానాన్న పరువంతా పోయింది. ఇక అబ్బనరెడ్డిగారి టూరింగ్ టాకీసులో ఆపరేటరు పనికి పేద్ద దణ్ణం బెట్టేసి మళ్లీ చెల్లూరు ఫేక్టరీ చుట్టూ తిరగడం మొదలెట్టాడు.

అలా తిరగ్గా తిరగ్గా దొరికింది పని.

తన చదువుకన్నా చాలా నాసిరకం పని. బాయిలర్ దగ్గర.

రోజులు బాగానే గడుస్తున్నాయి.

నాకు యూనిఫారం, పుస్తకాలూ కొని చెల్లూరు స్కూల్లో చేరిపించేడు.

స్కూలు అయ్యేకా ప్రయివేటుగా చదుతున్న సంస్కృతంలో ఫస్ట్ క్లాసొచ్చింది నాకు. పొట్టి తెలుగు మేష్టారి అన్నయ్య పెద్ద తెలుగుమేష్టారు భగవద్గీత నాకు బహుమానంగా ఇచ్చేరు. దాన్ని మా నాన్నకి చూపిస్తే దాన్ని పట్టుకెళ్ళి ఫేక్టరీలో తనపై అధికారి అయిన గుజరాతీ ఆయనకి చూపించేడు. ఆ పుస్తకాన్ని తిరగేసి మరగేసి చూసిన ఆ అధికారి నన్ను చాలా మెచ్చుకున్నాడట.

అది నాకు చెపుతా ఒకరోజు నన్ను సైకిలెక్కించుకుని రామచంద్రపురం రాజుగారి హాల్లో పూలరంగడు సినేమాకి తీసుకెళ్ళాడు. అది నా ఊహతెల్సాక చూసిన నాలుగోసినిమా.

మొట్టమొదటిది మా అమ్మతో పాటు కొంకుదురు నించి వర్షంలో తడుస్తావెళ్ళి కొమరిపాలెం హాల్లో చూసిన అమరశిల్పి జక్కన్న, రెండోది తోబుట్టువులు, మూడో సినేమా పందలపాక వెంకటక్రిష్ణాహాల్లో లవకుశ.

సినేమా అయ్యాకా రాజుగారి ఐస్ఫార్లర్కి తీసుకెళ్ళి బటర్మిల్క్ ఇప్పించేడు. ఓ గుక్కేసిన 'నేను ఇదేంటి... చల్లటి ఇగణంలాగుంది?'' అన్నాను.

''అలాగే ఉంటది తాగు'' అన్నాడు మానాన్న.

''చల్ల లాగుందేంటి?'' మళ్లీ అడిగేను.

''చల్లే జీలకర్ర అల్లం కరేపాకూ ఉప్పూ కలిపి ఇసులో పెట్టేరు చలవ చేస్తది తాగు'' అన్నాడు.

మానాన్నకి పెద్దమ్మగారబ్బాయి డైవాల్‌రెడ్డి డూప్లికేటు బ్రాందీసీసాలు తయారుచేసి అమ్మేవాడు.

ఒకసారతను అనపర్తినించి పసలపూడి వచ్చినప్పుడు వాళ్ళ చెల్లెలు చెల్లాయమ్మగారింట్లో దిగి ''కాస్తసాయం చేద్దూగాని రారా'' అన్నాడు.

వెళ్ళిన మానాన్నకి అప్పుడేఅయ్యింది తాగే అలవాటు.

పోను పోను చాలా ముదిరిపోయిందా అలవాటు. ఫేక్టరీలో డ్యూటీ అయ్యాకా బాగా తాగేసి సైకిలెక్కి పడతాలేస్తా వచ్చేవాడు ఇంటికి. అది చూసిన మా అమ్మ గయ్యిమని లేచి మా పుట్టింటోళ్ళిచ్చిన ఆస్తి అవ్వగొట్టేడని మొదలెట్టేది. ఆ మనిషి పెట్టే అరుపులూ కేకలకి చుట్టు పక్కలుండే వాళ్ళందరికీ చాలా చిరాకయిపోయింది.

తనకీ తాగుడు బాగా ఎక్కువయిపోయేసరికి సస్పెండు చేసేరు అసిస్టెంటు మేనేజరుగారు. పనిలేక ఇంట్లో కూర్చున్న మానాన్న శ్రీశైలంలో ఉద్యోగం చేస్తున్న మా చెల్లాయత్త అల్లుడు లక్ష్మారెడ్డి చుట్టం చూపుకొస్తే అతని దగ్గరకెళ్ళి అప్పు అడిగి మరీ తాగడం మొదలెట్టాడు.

ఇక మానాన్నని చూసి భయపడిపోయిన మా అమ్మ చింతా తాతారెడ్డిగారి కాళ్ళు పట్టుకుని ఫేక్టరీలో పెద్దోళ్ళ దగ్గరకెళ్ళి కొంచెం మాటాడి పెట్టమంది.

తాతారెడ్డిగారి పుణ్యమా అని మళ్ళీ పన్లోకెళ్ళడం మొదలెట్టిన మానాన్న ఓవారం బానే ఉన్నాడు. ఆ తర్వాత మామూలే.

అడ్డమైన వాళ్ళ దగ్గరా అప్పులు చేసి ఒళ్ళూ, పాయా తెలీకండా తాగేసి వచ్చినప్పుడు నానా మాటలూ అనేవాడు మానాన్న. నీకు ఫలానా మనిషితో సంబంధం ఉంది నిన్నొదిలేస్తానసేవోడు. ఒకరోజు గొడవ మరీ ఎక్కువ చేసేసరికి బెల్టు తీసుకుని మానాన్నని కొట్టేసిన నేను ఆ మర్నాటి నించి సిగ్గుతో మాటాడ్డం మానేసేను.

మానాన్న పుస్తకాలు కొన్లేకపోయినా బూర్రావు మిషనుమీద బట్టలు కుట్టించకపోయినా నేను బాగా చదువుకుంటున్నాను. అన్ని ఫస్టుక్లాసులు. అలాంటి నన్ను చదువు మానిపించేసి కాలవ దగ్గర ట్రాక్టరు ట్రక్కులు తయారు చేసే షెడ్డులో పనికి పెట్టి నెలవ్వకండానే షెడ్డు ఓనర్ దగ్గరకొచ్చి జీతం పట్టుకెళ్ళిపోయేవాడు. కొన్నాళ్ళయ్యేకా మా వూరొచ్చిన మా చిన్నాన్న ఆయిలు బట్టలతో ఉన్న నన్ను చూసి వెంటనే పని మానిపించేసి మనం రెడీమేడ్ బట్టలషాపు పెడదాం రాంపురంలో నా స్నేహితుడు షాపుంది అందులో ట్రైనింగు అవ్వు అని రాంపురం ఈదల రఘురామయ్యగారి షాపులో చేర్చేడు. అక్కడ్నించి నాకు కాస్త తెలివితేటలొచ్చి జీతం డబ్బులు మానాన్నకి ఇచ్చేవాడ్ని కాదు. దాంతో దొరికిన చోటల్లా అప్పులు చేసేసేవాడు.

తాగేసొచ్చి ఏదేదో పేలేవాడు. అవి విని పెద్ద పెద్ద అరుపులతో మాఅమ్మ. ఇక అక్కడుండడం చాలా పెద్ద నరకం కిందుండేది.

ఆ టైములోనే, కాలవకాడ కర్రి అప్పారెడ్డిగారి భాస్కర్రెడ్డి ద్వారా పరిచయమయ్యేడు వల్లూరి సూర్య వెంకటరత్నం. అతని ద్వారా నాకు సిగరెట్లు అలవాటయ్యాయి. నేవీబ్లూ అనేబ్రాండు సిగరెట్లు. రాంపురంలో ఉన్న అతని రూమ్‌లోనే ఎక్కువగా గడిపి ఏ అర్ధరాత్రో ఇంటికెళ్ళేవాడ్ని.

ఒకరోజు, మేముంటున్న తాటాకింటి చూర్లో మానాన్న రాసుకున్న పుస్తకం నాక్కనిపిస్తే తీసి చదివేను.

అంతా వేదాంతం లాగుంది. భాషకూడా మామూలుగా లేదు. మానాన్నకి అంత గొప్ప భాష తెల్సుని నాకు తెలీదు. ఏంటేంటో ఏమాత్రం అర్థంగాలేదుగానీ ఒక్కటి మట్టుకు తెల్సింది మానాన్న అందరిలాంటివాడూ మట్టుకి కాదు... భావుకుడు, తాత్వికుడు. చరిత్రహీనుడు.

చాన్నాళ్ళుగా మాటాడ్డం మానేసిన నేను అయ్యో ఎంత తప్పు చేసేను... బెల్టుతో కొట్టి ఎంత పాపం చేసేను ఎల్గాగైనా సరే ఈవేళ మానాన్నతో మాటాడదాం అనుకున్నాను.

కానీ,

''ఈవేళ తొందరగా ఇంటికెళతాను అంటే భలే మొనగాడు సినేమా చూద్దామను కున్నాం గదా కుదుర''దంటా లాక్కుపోయేడు వెంకటరత్నం.

రాజుగారి హాల్లోరెండో ఆట చూసి ఇంటికెళ్ళేసరికి మా అమ్మ ఒక్కర్తే ఏడుస్తుంది. ఆ ఏడుపు అదోలాగుంది అంతకు ముందెప్పుడూ వినలేదు నేను. లోపలికెళ్ళి చూస్తే మానాన్న చచ్చిపోయి ఉన్నాడు. బాగా తాగేసొచ్చిన మానాన్న నిద్దట్లోనే పోయేడట.

మంచం పక్కనే తను కాల్చే దక్కనుసిగరెట్టు పెట్టె ఉంది. అది తీసుకుని సిగరెట్టు వెలిగిస్తా అరుగుమీద కూర్చున్నాను.

నల్లమిల్లి పెదభామిరెడ్డిగారి పెద్దబ్బాయిగా కుతుకులూరులో చిన్న వెలుగు వెలిగిన మా నాన్న జీవిత చరిత్ర ఆరాత్రితో అలా ముగిసిపోయింది.

* * *